

ఉల్లి రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో ఉల్లి రైతులకు క్వింటాలుకు రూ.2000 ఇచ్చి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులను రైతు సంఘం ప్రతినిధి బృందం జి.రామకృష్ణతోపాటు జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కోటకొండసూరి రైతు సంఘం సీనియర్ నాయకులు జి.ఆంజనేయులు, సంఘం నాయకులు అస్లాంబాష పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ లో ఉల్లి పంట దెబ్బతిని ధర లేక తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రబీ పంట కైనా మంచి ధర వచ్చి ఎంతో కొంత ఊరట కలుగుతుందని ఆశించారన్నారు. ఉల్లి పంట దిగుబడి బాగా వచ్చిందని, బోర్ల దగ్గర బావుల దగ్గర కాలువలు కింద వేసిన పంట సుమారు ఎకరానికి 160 నుంచి 170 క్వింటాళ్ల దాకా వచ్చినట్లు తెలిపారు. గడ్డ నాణ్యత కూడా చాలా బాగుందని తెలిపారు. కానీ ధర మాత్రం గొర్రె తోక బెత్తెడు అన్నట్లు క్వింటాలు ధర రూ.400 నుండి రూ.650, రూ.700 వరకు మాత్రమే లభిస్తుందన్నారు. దీనివలన రైతులకు ఒక ఎకరానికి (పెట్టుబడి ఖర్చు కూడా రాక) రూ.50వేల దాకా నష్టం వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసిన దానిని ప్రభుత్వం బోనస్ రూపంలో ఇవ్వడానికి నిర్ణయించగా మారిన ప్రభుత్వం ఉల్లి రైతులకు ఇవ్వాల్సిన రూ. 17 కోట్లు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఈ సంవత్సరం కూడా తక్కువ రేటుకు కొనుగోలు చేసిన ఉల్లికి బోనస్ రూపంలో ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని లేదా మార్క్ ఫెడ్ ద్వారా క్వింటాలుకు రూ.2000 ఇచ్చి కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్ ను పరిశీలించిన అనంతరం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి గోవిందును కలిసి సమస్యను విన్నవించారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రైతులను ఆదుకోకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదని, రైతులందరినీ కూడగట్టి ఆందోళన చేస్తామని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు.



రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

త్రిపురలో బిజెపి గూండాలపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

త్రిపురలో శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందని సిపిఎం, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలపై దమనకాండ ప్రయోగిస్తుందని, బిజెపి వైఖరిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. త్రిపురలో బిజెపి నిర్వహిస్తున్న దమనకాండ కు వ్యతిరేకంగా శనివారం కర్నూలు కలెక్టరేట్ ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సిపిఎం ఓల్డ్ సిటీ సెక్రెటరీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నాయకులకు ఢిల్లీ నుండి గల్లీ వరకు ఎవరికీ ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేదని, ప్రజలపై దాడులు చేయడమే వారి పనిగా పెట్టుకున్నారని ఘాటుగా విమర్శించారు. మతం పేరుతో, కులం పేరుతో, గోహత్య పేరుతో మైనార్టీల పైన, దళితులపైన, రచయితల పైన దాడులు చేస్తున్న బిజెపి మూకలు త్రిపురలో అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేయడానికి ప్రజల అవకాశం ఇస్తే ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను ప్రధానంగా సిపిఎంను టార్గెట్ చేస్తూ ఆ పార్టీ కార్యకర్తల ఇళ్లను ధ్వంసం చేస్తూ తగలబెట్టడం దుర్మార్గమైన చర్య అని, ఇది పిరికిపందలు చేసే పని అని విమర్శించారు. డబ్బుల సంచులు మూటగట్టుకుని కోట్లాది రూపాయలు వెదజల్లి ఎన్నికల్లో గెలవడం గొప్ప కాదని అన్నారు. నీతికి నిజాయితీకి మారుపేరు బిజెపి అని సంకలు గుద్దుకుని చెబుతున్న బిజెపి నాయకుల అసలు బండారం కర్ణాటకలో బయటపడిందని తెలిపారు. ఒక సామాన్య కార్యకర్త ఇంట్లోనే రూ.కోట్లాది నోట్ల కట్టలు బయటపడితే ఇక నాయకుల ఇంట్లో ఎన్ని రూ.కోట్లు దాచారో ప్రజలు గమనించాలన్నారు. ప్రజలకు సేవ చేసి ఓట్లు అడిగే ధైర్యం బిజెపికి లేదని, అందుకోసమే మతం పేరుతో కులం పేరుతో ప్రజలను విభజిస్తూ డబ్బులు కూడా ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే రూ.కోట్లను ఈ రకంగా తిరిగి ఎన్నికల్లో గెలవడం కోసం ఉపయోగిస్తుందని, బిజెపి ఎన్నికల్లో గెలవడం అంటే కార్పొరేట్ కంపెనీలు గెలవడమేనని అన్నారు. దాడులతో ఉద్యమాన్ని ఆపాలని చూస్తే గతంలో అమెరికా కూడా వియత్నాంను నామరూపాలు లేకుండా చేయాలని ప్రయత్నించిందని, అలాంటి అమెరికానే తోక ముడుచుకుని పారిపోయేలా అక్కడ ఎర్రజెండా చేసిందన్నారు. ఇక్కడ కూడా బిజెపి తాత్కాలికంగా లాభం పొందొచ్చు తప్ప కచ్చితంగా సిపిఎం నాయకత్వంలో ప్రజలు తిరుగుబాటు చేసే రోజు వస్తుందని హెచ్చరించారు. దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని, దాడులను ప్రోత్సహిస్తున్న సర్కారు పై గవర్నర్ జోక్యం చేసుకుని శాంతియుత వాతవరణం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ త్రిపురలో దాడి చేసిన బిజెపి గుండాలను తక్షణమే అరెస్టు చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ సిపిఎం నగర కార్యదర్శి రాముడు, పుల్లారెడ్డి, నగరనాయకులు సాయి బాబా, సుధాకర్, విజయ్, షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ నర్సింలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థుల ముందంజ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల్లో నిలిచే అభ్యర్థుల జాబితా ఖరారు కావడంతో ఆయా అభ్యర్థులు ప్రచారంలో ముందుకెళ్తున్నారు. పిడిఎఫ్, ప్రజాసంఘాలు బలపరిచిన అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో దూసుకు వెళ్తున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. పోతుల నాగరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో, పాఠశాలలు కళాశాలల్లో పర్యటించి సిబ్బందిని ఓట్లు అభ్యర్థించారు. న్యాయవాదులను కూడా కలిసి ఓట్లు అడిగారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆయన తరపున ప్రజాసంఘాల నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. కత్తి నరసింహారెడ్డి తరపున పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల, నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష అభ్యర్థుల అనైతిక చర్యలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రచారంలో అడుగడుగునా వారికి సానుకూల స్పందన లభిస్తోంది.

మళ్లీ బండ బాదుడు : వంట గ్యాస్ ధర అంతకంతకూ మండుతూనే పోతోంది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ పోతుండటంతో సామాన్యులపై భారం పడుతూనే ఉంది. గ్యాస్ ధర మరో సారి రూ.50 పెంచడంతో మొన్నటి దాకా రూ.1108 ఉన్న గృహ వినియోగానికి వాడే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.1158కి చేరింది. సామాన్యులపై గ్యాస్ భారం పెరిగింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ ధర రెండేళ్లలోనే ఏకంగా రూ.266 మేర పెరిగింది. సిలిండర్ ధర 2021 జనవరిలో రూ.748.5 ఉండగా రూ.75.50 పెంచారు. దాంతో రూ.824కు చేరింది. మార్చిలో మళ్లీ రూ.50 పెంచడంతో రూ.874కు పెరిగింది. ఏప్రిల్ లో రూ.10 తగ్గి రూ.864కు చేరింది. జులైలో మళ్లీ రూ.25.5 పెరగడంతో రూ. 889.5కు, ఆగష్టులో రూ.25 పెరగడంతో 914.5కు, తరువాత సెప్టెంబర్ లో రూ.25, అక్టోబర్లో రూ.15 పెంచడంతో రూ. 954.5కు చేరింది. ప్రస్తుత రూ.50 పెంపుతో రూ.1158కి చేరింది. ధరలను అదుపులో పెట్టాల్సిన ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు వంట గ్యాస్ సబ్సిడీని కూడా గాలికి వదిలేశారు.



రాయలసీమ సమగ్రాభివృద్ధికి కృషి

- మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి - పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాయలసీమ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని కనిష్క హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించే గొంతుకలైన పిడిఎఫ్ అభ్యర్థులను బలపరచి ఓటు వేయాలని అభ్యర్థించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పాల్పడుతున్న అనైతిక చర్యలను ఓటర్లు గమనించాలని తెలిపారు. రాజ్యాంగ హక్కులను కాపాడడం కోసం, నిరుద్యోగులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మండలిలో పోరాడుతున్నారని చెప్పారు. వారి పక్షాన తమకు బలాన్ని ఇవ్వాలని కోరారు. అధికార పార్టీ నాయకులు ఈ ఎన్నికల్లో తమ మందబలంతో ఎంపీ, ఎమ్మెల్యేలతో ఓట్లను కొనుగోలు చేసేందుకు దళారులను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. టిడిపి అభ్యర్థి 275 ఎకరాల పేదల భూమిని కొల్లగొట్టారని, దీనిపై విచారణ సాగుతోందని చెప్పారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్సీ అయితే ఎవరి కోసం పని చేస్తారో ఓటర్లు ఆలోచించుకోవాలని తెలిపారు. వైసిపి అభ్యర్థి గతంలో ఎమ్మెల్సీగా ఉన్న వెన్నపూస గోపాల్‌రెడ్డి కుమారుడని, ఆరేళ్లుగా ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై మాట్లాడని వారు ఇప్పుడేం మాట్లాడతారని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు మాత్రమే అధికార పార్టీని ఓడించే దమ్ముందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి అధికార పార్టీ అనైతిక చర్యల నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని కోరారు. ప్రజా సమస్యలపై గళమెత్తిన చరిత్ర టిడిపికి లేదన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం, అధ్యాపక పోస్టుల భర్తీ, డీఎస్సీ నోటిఫికేషన్ కోసం, ఉద్యోగుల, పెన్షనర్ల, కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో ప్రత్యక్షంగా పోరాడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను హరిస్తోందని, మీడియాను కాపాడేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా తీసుకొచ్చిన జిఒ 1ను రద్దు చేసేందుకు పోరాడతామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 27వ వరుస సంఖ్యలో పోతుల నాగరాజు పేరు పక్కన '1' నెంబర్ వేసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు శేష ఫణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కర్నూలు ఫోరం కన్వీనర్ టి.నరసింహ పాల్గొన్నారు. **ఆలూరు**కు వచ్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలతో కలిసి చెక్‌పోస్ట్ నుంచి జూనియర్ కళాశాల ఆడిటోరియం వరకు ర్యాలీగా వస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోతుల నాగరాజు మాట్లాడారు. ఆర్‌పిఎఫ్ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్ర గౌడ్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఖాసీం, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణస్వామి, రైతుసంఘం నాయకులు భూపేష్, ఎఐటియుసి తాలూకా నాయకులు రామాంజనేయులు, సిఐటియు మండల నాయకులు షాకీర్ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పోతుల నాగరాజు



ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోతుల నాగరాజు, నాయకులు

జిల్లాలో హ్యాండ్ బాల్‌కు పూర్వ వైభవం

- 8వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

పేద క్రీడాకారుల సంక్షేమానికి పెద్దపీట వేద్దామని పోటీల నిర్వాహక కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి అతిథులు అన్నారు. శనివారం కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో కర్నూలు జిల్లా హాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో 8వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ వెంకటరమణ, సిఐలు పార్థసారధి రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ రుద్రరెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన శిక్షకుడు నటరాజరావు, ఒలంపిక్ సంఘం సిఇఒ పి.విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఒలింపిక్ కార్య నిర్వాహక కార్యదర్శి పి . సునీల్ కుమార్ , రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం టెక్నికల్ కమిటీ సభ్యులు బాబి, ఈస్ట్ గోదావరి కార్యదర్శి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. జిల్లాలో హాండ్ బాల్‌కు పూర్వ వైభవం తేవాలని కోరారు. జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ క్రీడా పోటీల నిర్వహణకు జిల్లా క్రీడా శాఖ తరపున నిత్యం సహకరిస్తాము అన్నారు. సిఐలు పార్థసారధి రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ క్రమశిక్షణకు క్రీడాకారులు మారు పేరని క్రమశిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. న్యాయవాది శ్రీధర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు క్రీడాకారుల సంక్షేమానికి సహాయ సహకారాన్ని అందించేలా పాటుపడాలని కోరారు. అంతకు ముందు 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు కవాతు చేయగా అతిథులు గౌరవ వందనం చేశారు. జండాలు ఆవిష్కరించారు. అనంతరం కర్నూలు జట్టు , విశాఖపట్నం జట్టు పోటీ పడ్డాయి అతిథులు ఇరు జట్టు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హ్యాండ్ బాల్ (సాయి)శిక్షకుడు వినయ్, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా త్రో బాల్ సంఘం జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి జుబేర్ అహ్మద్ లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ వెంకటరమణ

వేసవిలో జరభద్రం : డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతి ఒక్కరు వేసవిలో తగు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో తెలిపిన వివరాలు.... ఎండాకాలంలో ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే బయట తిరగాలి. 11 గంటల నుండి నాలుగు గంటల మధ్య అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి రావాలి. తలపై టోపీ కానీ, టవలును గానీ కప్పుకోవాలి. మందం దుస్తులను వాడకుండా చెమటను పీల్చే పలుచటి కాటన్ దుస్తులను ధరించాలి. నీళ్లను ఎక్కువగా తాగుతుండాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లను తీసుకుంటూ ఉండాలి. శీతల పానీయాలను ఎక్కువగా వాడరాదు. ఐస్‌తో కూడిన పళ్ళ రసం, చెరుకు రసం తీసుకోరాదు. చిన్న పిల్లలు వయో వృద్ధులు ఎక్కువగా బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే నీళ్లలో ఓఆర్ఎస్ కలిపిన నీళ్లను తీసుకోవడం మంచిది. వేసవిలో లభించే ఎక్కువ నీటి శాతం గల కళంగర, బొప్పాయి, కర్బూజా, బత్తాయి, నారింజ, కమలా పండ్ల రసాలను తీసుకోవడం మంచిది. కృత్రిమంగా మాగించిన పండ్ల కన్నా సహజ సిద్ధంగా మాగిన పండ్లను తినడం ఉత్తమం. ఆరోగ్యమే మహాబలం, ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని గ్రహించాలి.



జిల్లా జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్ :

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్. వెంకట నాగ శ్రీనివాసరావు , లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌కు సంబందించిన చీఫ్ మనోహర్, డిప్యూటీ శివరామచంద్రరావు అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సెల్స్ పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును సందర్శించారు. అక్కడి ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. 65 సంవత్సరాలు పైబడిన ఖైదీల వివరాలు సేకరించారు. ఖైదీలతో మాట్లాడటానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి, ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవాధికారసంస్థను ఆశ్రయించాలని చెప్పారు.

వంటగదులు, జైలు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచలను ఇచ్చారు. ఉన్నత న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటుచేసిన చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి శ్రీనివాస రావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్. వెంకట నాగ శ్రీనివాసరావు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు సునీత, మాధవి, జైలు పర్యవేక్షణ అధికారులు, పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారుడు నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సామాన్య ప్రజలలో ఒకరిగా ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచే పోతుల నాగరాజును ఎమ్మెల్సీగా గెలిపించు కుందామని సిఐటియు నాయకులు అన్నారు. శనివారం కర్నూలు ఓల్డ్ సిటీ, బాబు జగ్జీవన్ రామ్ కాలనీ పక్కనే ఉన్న బిఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్, సిఐటియు జిల్లా నాయకులు జెల్లి. నాగేశ్వరరావు, మోటార్ వర్కర్ సీనియర్ నాయకులు రియాజ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాబాష ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంచుతూ మొదటి ప్రాధాన్యత ఓటు పోతుల నాగరాజుకు వేయాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉద్యోగస్తులు ఒక మంచి వ్యక్తిని పిడిఎఫ్ తరపున పోటీ చేయించి ప్రచారం నిర్వహిస్తున్న మీకు ధన్యవాదాలు అని ప్రశంసలు కురిపించారు. మీ కష్టం వృధా కాదు గెలిచేది నాగరాజే మేమందరం ఆయనకే ఓటు వేస్తామని హామీ ఇచ్చారు.



ప్రచారంలో సిఐటియు నాయకులు

17న ఆన్ లైన్‌లో పోలీసు వాహనాల వేలం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా పోలీసు విభాగానికి చెందిన కాలం చెల్లిన 39 పోలీసు వాహనాలను 15 లాట్లుగా విభజించి, మార్చి 17 న వేలం నిర్వహించనున్నట్లు శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ పద్ధతి ద్వారా వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు https://konugolu.ap.gov.in అనే వెబ్ సైట్లో బిడ్డింగ్ వేయాల్సిందిగా సూచించారు. ఈ వాహనాలు కర్నూలు లోని (జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం) డిస్ట్రిక్ట్ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్నాయని, ఆసక్తి కలిగినవారు చూసుకోవచ్చున్నారు. ఆసక్తిగలవారు ఎంటిఒ ఆర్ఐ విఎస్. రమణ, సెల్ నెం.9121101053, రైటర్ సెల్ నెం. 9908628390 లను సంప్రదించాలని కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థి తరుపున విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండల కేంద్రంలోని రెడ్డిగేరి, ఆనకలగేరి, వడ్డగేరి, బోయగేరి సాలమ్మగారి వీధి, ముళ్ళ స్ట్రీట్ ఎస్సీ కాలనీ మాలగేరి తదితర వీధుల్లో తిరిగి పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీరియల్ నంబర్ 27 డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సిఐటియు మండల అధ్యక్షులు రాజు, ప్రజాశక్తి రిపోర్టర్ అంజి, హమాలి యూనియన్ నాయకులు రవి నాయుడు, చిన్నలు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉన్నత విద్యావంతులు ఓటు వేసే ఈ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా విద్యావంతుల తరపున విద్యా వ్యవస్థ పైన నిరుద్యోగం పైన రైతులు కార్మికులు కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను నిస్వార్థంగా శాసనసభకు తీసుకెళ్లగలిగే ఉద్యమ నేపథ్యం కలిగిన పిడిఎఫ్ , 198 ప్రజాసంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాజకీయ పార్టీలకు కాకుండా అభ్యర్థి విద్య ,ఉద్యమ నేపథ్యం పరిశీలించి ఓటు వేయాలని కోరారు.



వెల్దుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న నగేష్ , తదితరులు

నవధాన్యాలు సాగుతో నేలకు ప్రయోజనం

డిపిఎం చంద్ర శేఖర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని డిపిఎం చంద్రశేఖర్ ఆన్నారు. శనివారం కల్లూరు మండలం ఏ గోకులపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, పిఎండిఎస్ నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఖరీఫ్ కంటే ముందు 30 రకాల నవధాన్య విత్తనాలను 13 కేజీలు ఒక ఎకరానికి వెయ్యాలన్నారు. ఈ విత్తనాల్లో పచ్చిరొట్ట విత్తనాలు, పప్పుధాన్య విత్తనాలు, ఆకుకూరల విత్తనాలు, కాయగూరల విత్తనాలు, సుగంధ ద్రవ్యాలు ఉండాలని తెలిపారు. ఈ విషయంపై ప్రకతి వ్యవసాయ సిబ్బంది, గ్రామంలోని స్కూల్ విద్యార్థిని విద్యార్థులు ద్వారా , ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి 'నవధాన్యాలు సాగు నేలతల్లి బాగు, రసాయనాలు ఎరువులు వద్దు, నవధాన్యాలే ముద్దు,' అను నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చిన్న స్వాములు, మహాదేవమ్మ రైతులకు పిఎండిఎస్ నవధాన్యాల కిట్స్ అందజేశారు. ఈ తరహా వ్యవసాయం వల్ల పర్యావరణానికి ఎటువంటి నష్టం జరగకుండా, నేలను సారవంతం చేసుకుని మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. రసాయనాలు వాడడం వల్ల వచ్చే పంటను తినడం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. పకృతి సేంద్రియ పంటలే ఆరోగ్యానికి మంచిదని ర్యాలీ ద్వారా ప్రజానీయానికి, రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్, ఎన్ఎఫ్ఎ శ్వేత, మాస్టర్ ట్రైనర్స్ మురళి మోహన్, భవాని రాజ్, ఆంజనేయులు, సురేంద్ర, యూనిట్ ఇన్‌ఛార్జులు రాముడు, చెన్నకేశవులు, విఎ ఎ. మల్లికార్జున, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఎ గోకుల పాడులో ప్రదర్శన

సేంద్రియ ఎరువులతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి- సి బెళగల్ : సేంద్రియ ఎరువుల వాడకంతో చక్కటి ఫలితాలు వస్తాయని ఎఒ మల్లేష్ సూచించారు. మండలంలోని ముడుమాలలో ఏర్పాటైనా సుస్థిర వ్యవసాయ కేంద్రంలో 20 వ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యవస్థాపక బృందం డైరెక్టరులు, సిబ్బంది, ఎఒ మల్లేష్ కుమార్ లు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ, కృత్రిమ ఎరువుల వాడకంతో ఫలితాలు ఆమోగమని పేర్కొన్నారు. అనంతరం ఎఒ మల్లేష్ కుమార్, రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి హాజరును పరిశీలించారు.

'పది'లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- డిఇఒ రంగారెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

రానున్న పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి కర్నూలు జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయమని డిఇఒ వి.రంగారెడ్డి తెలిపారు. శనివారం గోనెగండ్లలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో వసతులు, ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పదో తరగతి విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పరీక్షలకు సిద్ధమవుతున్న విధానం, ఉపాధ్యాయ సిబ్బంది బోధనా తీరు తదితర అంశాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సిద్ధం కావాల్సిన విధానం, సులువుగా ఉత్తీర్ణత సాధించేందుకు పాటించాల్సిన అభ్యసనపై సూచనలు చేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ... ఎంతమంది బైజూస్ వాడుతున్నారు, వారి పర్ఫామెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పర్ఫామెన్స్ తక్కువగా ఉండడంతో సోమవారంలోపు ప్రతి విద్యార్థి మూడు వేలలోపు పర్ఫార్మెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలని తెలిపారు. ఉర్దూ ఎఎంఒ ఆదామ్ బాష, ఎంఇఒ వినోద్ కుమార్, కెజిబివి ఎస్ఒ విద్యావతి, సిఆర్‌పి రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం
7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

- డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని


వివరాలు వెల్లడిస్తున్న రెవెన్యూ అధికారులు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల కోసం ఆదోని నియోజకవర్గంలో 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆదోని డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ఆదోని నియోజకవర్గంలో 6,103 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, అలాగే 513 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో పట్టభద్రుల ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోవడానికి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 3 పోలింగ్ కేంద్రాలు, అలాగే నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మరో 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి మున్సిపల్ హైస్కూల్‌లో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ స్లిప్పులను విఆర్‌ఒల ద్వారా, బిఎల్‌ఒల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడి నుంచే ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఆదోని తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మాల వెంకటేష్‌పై కౌంటర్ కేసు దారుణం

- మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


విలేకరులతో మాట్లాడుతున్న రంగయ్య

అగ్రకులాల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మాల వెంకటేష్‌పై కౌంటర్‌గా రేప్ కేసు పెట్టడం సిగ్గు చేటని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య తెలిపారు. శనివారం ఆయన హోళగుంద పోలీసు స్టేషన్‌కు వెళ్లి కేసు వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాడికి సంబంధించి సెక్షన్లు కూడా సరిగా లేవని, దళితులపై అంత వివక్షత ఎందుకని ప్రశ్నించారు. వెంకటేష్‌పై కౌంటర్ కేసు ఏ ఆధారాలతో పెట్టారని, కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్, దాడి వీడియో, ఆడియో, ఫొటోలు, మెడికల్ సర్టిఫికెట్ అన్ని ఆధారాలతో ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కేసును ప్రత్యేక కమిషన్ వేసి నిజ నిర్ధారణ చేసేలా, నిందితులపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాడతామని చెప్పారు. సోమవారం ఎస్పీని కలుస్తామని తెలిపారు. మాలమహానాడు జిల్లా నాయకులు మల్లేష్, యూత్ నాయకులు బలరాం, రాముడు, వీరేష్, హెబ్బటం శ్రీను, వన్నూరప్ప పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడే వారిని ఎన్నుకుందాం


ఎమ్మిగనూరులో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు


పెద్దకడబూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


నందవరంలో ప్రచారం చేస్తున్న నాయకులు

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యలపై పోరాడే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిద్దామని ప్రజాసంఘాల నాయకులు, జనసేన నాయకులు తెలిపారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శనివారం జనసేన మండల నాయకులు భాస్కర్, కందనాతి ప్రభాకర్, రాజు, తదితరులు తేరుబజారులోని ప్రజా సంఘాల కార్యాలయంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సామాజిక ఉద్యమాల కోసం, విద్యార్థుల సంక్షేమం కోసం, జాబ్ క్యాలెండర్ కోసం, ఉద్యోగుల సమస్యలపై పోరాటం కోసం, బడుగు బలహీన వర్గాల సమస్యలపై పోరాటం కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర నాయకులు బి.రామాంజనేయులు, వృత్తి సంఘాల జిల్లా నాయకులు గోవిందు, రైతు సంఘం నాయకులు హనుమంతు, సిఐటియు నాయకులు రాముడు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులు, ప్రజా ఉద్యమ నాయకులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. మండలంలోని హెచ్.మురవణి, దొడ్డిమేకల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, వ్యకాస జిల్లా నాయకులు ఈ.తిక్కన్న మాట్లాడారు. సామాజిక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న పోతుల నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, విద్యార్థి నాయకునిగా, సామాజిక కార్యకర్తగా, వెనుకబడిన కులాల ఐక్యవేదిక నాయకులుగా, మహాత్మ పూలే ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులుగా పని చేశారని గుర్తు చేశారు. రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. కత్తి నరసింహారెడ్డి ఆల్ ఇండియా స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలను లేవనెత్తాలంటే ఉద్యమ నాయకులను శాసనమండలికి పంపించాలని కోరారు.

నందవరం : ప్రశ్నించే గొంతుకలను శాసనమండలికి పంపిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కనకవీడు రాజు కోరారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండలంలోని మాచవరం, ఇబ్రహీంపురం, కొట్టాల, నదికైరవాడి, జొహరాపురం, సజీవపురం, చిన్నకొత్తిలి, నాగలదిన్నె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో పట్టభద్రులను కలిసి ఓటును అభ్యర్థించారు. చేనేత నాయకులు ఎల్లేష్, కెవిపిఎస్ నాయకులు నీడాంబరం పాల్గొన్నారు. **మంత్రాలయంలో** పట్టభద్రులను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు మాట్లాడారు. శాసన మండలిలో తమ వాణి వినిపించే సామర్థ్యం గల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. వ్యకాస నాయకులు టి.ప్రాణేష్, కెవిపిఎస్ నాయకులు డి.ఆంధ్రయ పాల్గొన్నారు.

దేవనకొండ : ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే ఉద్యమకారులను గెలిపించుకుందామని ప్రజాసంఘాల నాయకులు కె.మద్దిలేటిశెట్టి, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ కోరారు. దేవనకొండలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థల్లో పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఓటర్లను ఆకర్షించే విధంగా ఉపాధ్యాయులకు గిఫ్ట్ బాక్సులు పంపుతున్నారని తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు ఎమ్.నరసరావు, నెట్టేకల్, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, ప్రజాసంఘాల నాయకులు రవికుమార్, అశోక్, యూసుఫ్, సుల్తాన్ పాల్గొన్నారు.

కొతాళం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. ఉరుకుంద గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడే వ్యక్తిని ఎన్నుకోవాలని కోరారు. రైతు సంఘం మండల కన్వీనర్ ఈరన్న, నాగరాజు పాల్గొన్నారు.


మంత్రాలయంలో


దేవనకొండలో



హోటల్ నిర్వహణ కష్టమే...

- హోటల్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి -ఆదోని

పెరిగిన గ్యాస్ ధరతో హోటల్ నిర్వహణ కష్టతరంగా మారిందని హోటల్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ద్వారక సినీ కాంప్లెక్స్ ఆవరణలోని ఆవకాయ హోటల్‌లో ఆదోని హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు మాధవస్వామి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ద్వారా పరిష్కరించిన సమస్యలను ఆదోని డివిజన్ హోటల్ అసోసియేషన్ కార్యదర్శి టి.వీరేష్ వివరించారు. ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా హోటల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొండయ్య, ఆదోని గౌరవాధ్యక్షులు అధ్యక్షులు కెబి.రాజస్వామి, ఎమ్మిగనూరు అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, సాయిరాం హాజరై మాట్లాడారు. కమర్షియల్ సిలిండర్ ధర పెంచడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరల వల్ల హోటల్ వ్యాపారం కష్టంగా మారిందని తెలిపారు. హోటల్‌లోని తిండి పదార్థాల ధరలు పెంచితే కస్టమర్లు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం పేరుతో మున్సిపల్ అధికారుల దాడులు, పరిశుభ్రం లోపించిందని ఫుడ్ సేఫ్టీ అధికారుల వేధింపులు, వాహనాలు నిలిపారని ట్రాఫిక్ పేరుతో పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. హోటల్ నిర్వహణతో చాలామంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. కుటుంబాల పోషణ, పిల్లల చదువు కూడా సరిపోని దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలు హోటల్ వ్యవస్థను కూడా గుర్తించి రాయితీలు ఇవ్వాలని కోరారు. గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, మంజునాథ్, ఎన్‌కె.సోమశేఖర్, హోటల్ నిర్వాహకులు ముజిబ్ అహ్మద్, చాంద్‌బాషా, సద్దాం సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్

ఆత్మరక్షణకు కరాటే అవసరం

ప్రజాశక్తి- వెల్దుర్తి

ఆత్మ రక్షణ, ఆత్మవిశ్వాసానికి కరాటే ఎంతో అవసరమని వైసిపి మండల కన్వీనర్ రవిరెడ్డి అన్నారు. శనివారం పట్టణం లోని పద్మ విద్యా వికాస్ స్కూల్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ బడే సాహెబ్ అధ్యక్షతన నిర్వహించిన ఇంటర్ డోజో కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థానం చేరుకోవాలన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జడ్‌పిటిసి సుంకన్న బహుమతులు ప్రదానం చేశారు. ఎబి కరాటే అకాడమీ ఇంచార్జ్ ఫయాజ్, కరాటే మాస్టర్లు ఆరిఫ్ హుస్సేన్, రమణ, చంద్ర, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న బడేసాబ్


గుడి గేటు ముందు పడి ఉన్న మృతదేహం

గుడి ముందు అనాథ మృతదేహం

- ఇబ్బందులు పడిన భక్తులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ప్రభాకర్ సినిమా థియేటర్ సమీపంలో ఉన్న పురాతన శివాలయం ముందు అనాథ మృతదేహం పడి ఉంది. ఎండ తీవ్రత కారణంగా గోడ పక్కన విశ్రాంతి తీసుకుంటూ చనిపోయి ఉంటాడని స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మృతదేహాన్ని తొలగించకపోవడంతో శనివారం దర్శనం కోసం ఆలయానికొచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డారు. మృతదేహాన్ని తరలించాలని మున్సిపల్ అధికారులకు ప్రముఖులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించగా స్పందన లేదన్నారు. చివరకు ఛైర్మన్ భర్త నాగేంద్రకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని తరలించేందుకు ముందుకు వచ్చారు. పోలీసులు గుర్తించాలని, అప్పుడే తరలించేందుకు అవకాశం ఉందని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ తెలిపారు. గంటల తరబడి ఆలయ ముఖద్వారం వద్ద అనాథ మృతదేహం పడి ఉన్నా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం పట్ల పలువురు విమర్శలు చేశారు.

చంద్రబాబును కలిసిన ఆదోని న్యాయవాది



ప్రజాశక్తి - ఆదోని

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును కలిసినట్లు ఆదోని లీగల్ సెల్ నాయకులు, న్యాయవాది వీరన్న నాయుడు తెలిపారు. శనివారం అమరావతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టిడిపి లీగల్ సెల్ సమావేశానికి హాజరయ్యామన్నారు. తాను టిడిపి కోసం అందించిన సేవలు, తదితర అంశాలను బాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అవకాశం ఇస్తే ఆలూరు నియోజక వర్గంలో టిడిపి తరపున పోటీకి సిద్ధమని తెలిపామన్నారు. పరిశీలించి తప్పక న్యాయం చేస్తామని బాబు హామీ ఇచ్చారని చెప్పారు.

గ్యాస్ ధర పెంపు కేంద్ర ప్రభుత్వానికి తగదు

- ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని



వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై భారాలు మోపడం అన్యాయమని ఆమ్ ఆద్మీ పార్టీ ఆదోని కన్వీనర్ బసాపురం నాగరాజు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచిందని తెలిపారు. ఇప్పటికే ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు బతకలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు గ్యాస్ ధర 200 శాతం పెరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. పెరిగిన ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు బతకడం కష్టంగా మారిందన్నారు. వెంటనే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మూగితాత ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో వెలసిన దిగంబర దివానే మూగి తాత ఉరుసు ఉత్సవాలు శనివారం దర్గా కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గాను విద్యుద్దీపాలు, రంగులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి అశ్వం మీద గంధాన్ని ఊరేగింపు చేశారు. ఉత్సవాల సందర్భంగా బంధుమిత్రులతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. ఆదివారం స్వామి వారి ఉరుసు, సోమవారం జియారత్ వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.



వైభవంగా చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టాపన

- ప్రత్యేక పూజలు నిర్వహించిన టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని కుందనగుర్తి గ్రామంలో సర్పంచి పురుషోత్తం, గ్రామ పెద్దలు, ప్రజలు ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి విగ్ర ప్రతిష్టాపన, పోతప్ప విగ్రహ ప్రతిష్టాపన శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం ప్రతిష్టాపనను చేపట్టారు. ప్రతిష్టాపనకు టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్టాపన వల్ల గ్రామంలో పాడి పంటలతో రైతులందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాక్షించారు. సర్పంచి పురుషోత్తం కోట్ల సుజాతమ్మను పూలమాల, శాలువాతో సన్మానించారు. టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, రఘు ప్రసాద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, సతీష్, శ్రీలక్ష్మి, మాజీ కన్వీనర్ కిష్టప్ప, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, కొండ నెట్టప్ప, నరసింహులు, హేమాంజనేయులు పాల్గొన్నారు.


చిప్పగిరి : అమ్మవారి పూజలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ

మాధవ స్వామికి సుజాతమ్మ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో కొండా మాధవస్వామి రథోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ శనివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, రామారావు నాయుడు, మాలిక్ బాష, వెంకట స్వామి గౌడ్, మల్లికార్జున గౌడ్, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజా సాబ్, పెద్దయ్య, స్థానిక టిడిపి నాయకులు నాగేష్, లతీఫ్, చిన్న రాముడు, తిమ్మప్ప, అంజినయ్య పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం భక్తుల నడుమ అంగ రంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాంటుకు తాళం వేసిన కార్మికులు

ప్రజాశక్తి-తుగ్గలి

మండలంలోని వివిధ గ్రామాలలో శుద్ధజలం కింద ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అందులో పని చేస్తున్న కార్మికుడు బీమా నాయక్, మరి కొంతమంది కార్మికులు విలేకరులకు తెలిపారు. గత కొన్ని నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే శుద్ధ జలం ప్లాంట్‌కు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన శుద్ధ జలం ప్లాంట్‌లో గత కొన్ని నెలల నుండి పనులు చేస్తున్నామని, పనులు చేసి జీతం అడిగిన కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. ఇప్పుడు, అప్పుడు ఇస్తామని కాలయాపన చేశారే తప్ప ఇంతవరకు జీతాలు ఇవ్వకపోవడంతో ప్లాంటేషన్‌కు తాళాలు వేశారని తెలిపారు. ఇప్పటికైనా పత్తికొండ ఎమ్మెల్యే చొరవ తీసుకొని శుద్ధ జలం ప్లాంటేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇప్పించాలని వారు కోరారు. శుద్ధ జలం ప్లాంటును వెంటనే తెరిపించాలని, జీతాలు ఇవ్వకపోవడంతో ప్లాంట్‌ను బందు చేయడం జరిగిందని, అయితే ఈ సమస్యను వెంటనే పరిష్కరించి గ్రామాలలో శుద్ధ జలం నీటిని అందించాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీ రాములు అధికారులను కోరారు.

అభిమానుల మధ్య జడ్‌పిటిసి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో జడ్‌పిటిసి విరుపాక్షి 54వ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో తన ఇంటి దగ్గరే వేడుకలను నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా గుంతకల్లులోని అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. చిప్పగిరిలో భోగేశ్వర దేవాలయం దగ్గర ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పలువురు వృద్ధుల నుంచి ఆశీర్వాదం పొందారు. అనంతరం తన అభిమానులు తెచ్చిన భారీ కేక్‌ను కట్ చేశారు. వచ్చిన వారందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన మీద ఇంత అభిమానం చూపిస్తున్న అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ అభిమానం ఎల్లవేళలా తనపై చూపాలని కోరారు. రాబోయే కాలం అత్యంత క్లిష్టమైందని, అందరం ఒకే తాటిపైకి వచ్చి జగనన్నకు అండగా నిలబడి 2024లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి కృషి చేయాలని తెలిపారు. **హాలహర్విలో** వైసిపి యువ నేత, చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. స్థానిక వాల్మీకి మహర్షి విగ్రహం దగ్గర మాచనూరు దలవాయ్ సుంకన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. జడ్‌పిటిసిగా ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు. తిమ్మప్ప, గాదిలింగప్ప, వెంకటేష్, విజయ్ కుమార్, ఈశ్వర్, కొండయ్య, నాగరాజు, భూపాల్, వీర, రాము, రంగప్ప, డి.నాగరాజ్, రమేష్, ఈరన్న, యువరాజ్, గాది, బివిఆర్ యూత్, బిలేహాల్ నెట్టయ్య పాల్గొన్నారు. **ఆస్పరి** అంబేద్కర్ సర్కిల్‌లో యూత్ నాయకులు మసాలా ప్రకాష్, బిణిగేరి సర్పంచి వెంకటేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి, శుభాకాంక్షలు తెలిపారు. యువకులు సందీప్, వీరేష్, వెంకటేష్, మహేంద్ర, కృష్ణమూర్తి, మధు పాల్గొన్నారు.


చిప్పగిరిలో కేక్ కట్ చేస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి


హాలహర్విలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు


ఆస్పరిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ భూపాలుడు

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోండి

- ఎస్ఐ భూపాలుడు


ప్రజాశక్తి - దేవనకొండ

క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని స్థానిక ఎస్ఐ భూపాలుడు, ఎఒ సురేష్ బాబు, జడ్‌పిటిసి కిట్టు తెలిపారు. శనివారం దేవనకొండలో దిగంబర దివానే మూగితాత ఉరుసు ఉత్సవాల సందర్భంగా అంతర్‌రాష్ట్ర వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడాకారులను ఎల్లవేళలా ప్రోత్సహిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీం, వెంకట సాయి బ్రదర్స్ వేణు, శివ, చిట్టెం నాగేష్ పాల్గొన్నారు.

బాలమద్ది మృతి పార్టీకి తీరని లోటు

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - ఆస్పరి


ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామానికి చెందిన బాలమద్ది మృతి జనసేన పార్టీకి తీరని లోటని జనసేన పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్లు వెంకప్ప తెలిపారు. బాలమద్ది శుక్రవారం ఆదోని, ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం జనసేన నాయకులు బోయ బాలమద్ది మట్టి ఖర్చుల నిమిత్తం కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జనసేన మండల నాయకులు అరవింద్ కుమార్ మాట్లాడుతూ... బోయ బాలమద్ది కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. జనసేన నాయకులు బడేసాహెబ్, రంజిత్ కుమార్, వినోద్, వీరేష్, మనోజ్ పాల్గొన్నారు.



ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థుల ముందంజ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల్లో నిలిచే అభ్యర్థుల జాబితా ఖరారు కావడంతో ఆయా అభ్యర్థులు ప్రచారంలో ముందుకెళ్తున్నారు. పిడిఎఫ్, ప్రజాసంఘాలు బలపరిచిన అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో దూసుకు వెళ్తున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. పోతుల నాగరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో, పాఠశాలలు కళాశాలల్లో పర్యటించి సిబ్బందిని ఓట్లు అభ్యర్థించారు. న్యాయవాదులను కూడా కలిసి ఓట్లు అడిగారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆయన తరపున ప్రజాసంఘాల నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. కత్తి నరసిం హారెడ్డి తరపున పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల, నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష అభ్యర్థుల అనైతిక చర్యలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రచారంలో అడుగడుగునా వారికి సానుకూల స్పందన లభిస్తోంది.

మళ్ళీ బండ బాదుడు : వంట గ్యాస్ ధర అంతకంతకూ మండుతూనే పోతోంది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ పోతుండటంతో సామాన్యులపై భారం పడుతూనే ఉంది. గ్యాస్ ధర మరో సారి రూ.50 పెంచడంతో మొన్నటి దాకా రూ.1108 ఉన్న గృహ వినియోగానికి వాడే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.1158కి చేరింది. సామాన్యులపై గ్యాస్ భారం పెరిగింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ ధర రెండేళ్లలోనే ఏకంగా రూ.266 మేర పెరిగింది. సిలిండర్ ధర 2021 జనవరిలో రూ.748.5 ఉండగా రూ.75.50 పెంచారు. దాంతో రూ.824కు చేరింది. మార్చిలో మళ్లీ రూ.50 పెంచడంతో రూ.874కు పెరిగింది. ఏప్రిల్ లో రూ.10 తగ్గి రూ.864కు చేరింది. జులైలో మళ్లీ రూ.25.5 పెరగడంతో రూ. 889.5కు, ఆగస్టులో రూ.25 పెరగడంతో 914.5కు, తరువాత సెప్టెంబర్ లో రూ.25, అక్టోబర్లో రూ.15 పెంచడంతో రూ. 954.5కు చేరింది. ప్రస్తుత రూ.50 పెంపుతో రూ.1158కి చేరింది. ధరలను అదుపులో పెట్టాల్సిన ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు వంట గ్యాస్ సబ్సిడీని కూడా గాలికి వదిలేశారు.



పశువులకు అంతుచిక్కని వ్యాధి...

- వారం వ్యవధిలో రెండు ఎద్దులు మృత్యువాత
- రూ.2 లక్షల ఆస్తి నష్టం
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

పశువులకు అంతుచిక్కని వ్యాధి సోకింది. వారం వ్యవధిలో ఓ రైతుకు చెందిన రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన కొత్తపల్లి మండలంలోని బండినాయిని పాలెంలో శుక్రవారం వెలుగు చూసింది. ఈ ఘటనతో మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలెంకు చెందిన పరమటూరు నాగన్న అనే రైతు తనకున్న 4 ఎకరాలతో పాటు మరో 11 ఎకరాలు కౌలుకు తీసుకుని కుటుంబ జీవనం సాగించేవాడు. వ్యవసాయ పనుల కోసం ఎద్దులను ఉపయోగించేవాడు. అయితే వారం క్రితం వింత వ్యాధితో ఒక ఎద్దు మృత్యువాత పడింది. వారం గడవకముందే అదే వ్యాధితో మరో ఎద్దు మృత్యువాత పడడంతో బాధిత రైతు ఆందోళన చెందుతున్నారు. ఈ ఎద్దుల మృత్యువాతతో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. రైతు తనకున్న పొలంలో ఆ ఎద్దులతో వ్యవసాయ పనులు చేసుకునేవాడు. ఒక్కసారి వారం రోజులు గడవకముందే రెండు ఎద్దులు మృత్యువాతకు గురైన సంఘటన చూసి రైతన్న విలవిలలాడిపోతున్నాడు. ఉన్నఫలంగా ఎద్దు చనిపోయిన తరుణంలో ఆ ఎద్దుకు మరో ఎద్దును జతచేసుకుని వ్యవసాయం చేసుకోవాలన్న రైతన్నకు వారం లోపల ఊహించని సంఘటన జరగడంతో రైతన్న కుటుంబానికి సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగింది. గతంలో కూడా లంపి స్కిన్ వైరస్ వల్ల మండలంలో అనేకమంది రైతుల పశువులు మృత్యువాతకు గురైన సంఘటనలు మరిచిపోక ముందే అంతుచిక్కని వ్యాధితో ఒకే రైతుకు చెందిన 2 ఎద్దుల మృత్యువాత పడిన సంఘటన మండలంలో రైతన్నలను కలవరపెడుతుంది.


మృత్యువాతకు గురైన ఎద్దు

ఆర్థిక సాయంతో ఆదుకోవాలి - రైతు నాగన్న



వారం రోజుల్లోనే తనకు ఉన్న రెండు ఎద్దులు మృత్యువాతకు గురయ్యాయి. దీంతో ప్రభుత్వం తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరగడంతో వ్యవసాయ పనులు చేసుకోవడం కష్టంగా మారింది.

రైతులు ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవాలి
- పశువైద్యాధికారి భువనేశ్వరి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పశువులు ఉన్న రైతులు ప్రభుత్వ సేవలు ఉపయోగించుకోవాలి. గ్రామాల్లో ఎక్కువ శాతం ప్రయివేట్ వైద్యులను ఆశ్రయించి పశువులకు వైద్య సేవలు చేయించుకోవడం వల్ల రైతులు నష్టపోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పశువుల కోసం అనేక రకాల వైద్య సేవలతో పాటు ప్రత్యేక అంబులెన్సును కూడా ఏర్పాటు చేసింది. రైతులందరూ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. జరిగిన సంఘటనపై పరిశీలించగా ఆ ఎద్దులకు సరైన సమయంలో వైద్యం చేయలేదు.

సిద్ధ రామేశ్వరకొలనుకు దృఢమైన కంచె ఏర్పాటు చేయండి

శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్ లవన్న

ప్రజాశక్తి - శ్రీశైలం


పనులను పరిశీలిస్తున్న ఇఒ లవన్న

శ్రీశైల దేవస్థానం పరిధిలోని సిద్ధ రామేశ్వర కొలనుకు చుట్టూ దృఢమైన కంచె ఏర్పాటు చేయాలని శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్ లవన్న ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈనెల 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శ్రీశైలం వచ్చిన తర్వాత సిద్ధ రామేశ్వర కొలను సందర్శిస్తారని అన్నారు. ఉగాది మహోత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శనివారం నాడు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి లవన్న ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి సందర్శించారు. మెట్ల మార్గాన్ని కూడా మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. ప్రత్యేకంగా పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను చెత్తను తీసివేయించాలని ఆదేశించారు. భద్రతా చర్యల్లో భాగంగా రోజు పర్యవేక్షించే మొబైల్ స్క్వాడ్ సిద్ధ రామేశ్వర కొలను అనుక్షణం పరిశీలిస్తూ ఉండాలని అన్నారు. తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీరితోపాటు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

అన్నదానానికి విరాళం : శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించి యాత్రికులకు దేవస్థానం అందిస్తున్న అన్నదాన పథకానికి శనివారం నాడు పలువురు అన్నదాన పథకానికి విరాళం అందజేశారు. శ్రీశైలంకు చెందిన ఎం మల్లికార్జునరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి లక్ష రూపాయలు అన్నదాన పథకానికి విరాళంగా ఇచ్చారు. దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు.

6న స్పందన కార్యక్రమం రద్దు : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 6వ తేదీన స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఈ సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో మినహా మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజావాణిని వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

- ప్రజా సంఘాలు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - బేతంచెర్ల

నిస్వార్థ సేవకుడు ఉద్యమకారుడు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం రాష్ట్ర నాయకులు కె ప్రభాకర్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నర్సింహులు పిలుపునిచ్చారు. బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో డోన్ నియోజకవర్గ కార్మిక, కర్షక ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం సిపిఎం జిల్లా నాయకులు వైబి వెంకటేశ్వర్లు, ఆర్ ఈశ్వరయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె ప్రభాకర్ రెడ్డి, వై ఎల్లయ్య, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నరసింహులు మాట్లాడుతూ ప్రస్తుతం అధికార పార్టీ తమ అభ్యర్థి గెలవాలని ప్రయివేటు స్కూళ్లు సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ పట్టభద్రులను తమ అభ్యర్థులకు ఓటు వేసే విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ అడ్డుపెట్టుకొని వ్యాపారాలు పైరవీలు వంటివి అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల పట్ల గాని నిరుద్యోగుల పట్ల గాని ప్రజల సమస్యల పట్ల గాని ఏమాత్రం పట్టించుకోకుండా నిరంకుశంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నాదని వారన్నారు. రోజురోజుకు నిరుద్యోగ సమస్య అధిక ధరలు వంటి వాటిపై చట్టసభల్లో వినిపించడానికి అన్ని విధాలుగా సిద్ధపడిన నిస్వార్థపరుడు పట్టభద్రుల ఎమ్మెల్సీపోతుల నాగరాజు, ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బంధువులు శ్రేయోభిలాషులు కుటుంబ సభ్యులు ఓటు హక్కు కలిగిన వారిని మన వంతు ఓటు వేసి వేయించే విధంగా గట్టి ప్రయత్నం జరగాలన్నారు. ఈ సమావేశంలో డోను నియోజకవర్గం నాయకులు మాణిక్యం శెట్టి, వై ఎల్లయ్య, జి శేబారాణి, శివరాం, నక్కీ శ్రీకాంత్, కోయిలకొండ నాగరాజు, అర్జున్, ఫ్యామిలీ రహీం, రామాంజనేయులు, రహంతుల్లా, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, సూర్య, తిమ్మయ్య, బాలు, శివయ్య, నాగరాజు, ఎస్ఎఫ్ఐ విజయ్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు కే.ప్రభాకర్ రెడ్డి, చిత్రంలో సిపిఎం నాయకులు

శ్రీశైలం : ప్రజావాణిని చట్టసభల్లో వినిపించే దుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, సిఐటియు మండల కార్యదర్శి మారెన్న, నాయకులు మల్లయ్య, సిఐటియు మండల అధ్యక్షులు నాగరాజు కోరారు. శనివారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని శ్రీశైలం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువుకున్న విద్యావ ంతులు ఓటును ఒక మంచి నాయకునికి వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని మరిచి పెద్దల సేవలో మునిగి తేలుతున్నాయని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఉద్యోగుల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని వారు కోరారు.

విద్యావంతులు, మేధావులను గెలిపించండి : ఆవాజ్

నంద్యాల కలెక్టరేట్ : ఉద్యోగుల, ఉపాధ్యాయుల నిరుద్యోగుల సమస్యలపై మండలి సమావేశాలలో గళం వినిపించే పిడిఎఫ్ తరపున ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహ రెడ్డి పోతుల నాగరాజులను గెలిపించాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ వలి విద్యార్థులకు, మేధావులను కోరారు.

శనివారం ఆయన అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పరిరక్షింపబడాలంటే పిడిఎఫ్ బలపరిచే పశ్చిమ ప్రాంత పట్టభద్రులను గెలిపించాలన్నారు.

కొత్తపల్లి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేస్తున్న ప్రజా ఉద్యమ నాయకులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల కార్యదర్శి కే రాజేష్, ఎస్ఎఫ్ఐ మాజీ ఉద్యమ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రేమ్ విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని శివపురం గ్రామంలో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పోతుల నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా, విద్యార్థి నాయకునిగా, సామాజిక కార్యకర్తగా, వెనుకబడిన కులాల ఐక్యవేదిక నాయకునిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. అందుకనే పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గోడ పత్రికలను అతికిస్తున్న సిపిఎం సిఐటియు నాయకులు

శ్రీశైలం ప్రాజెక్టు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుని గెలిపించాలని సున్నిపెంటలోని రింగ్ పార్కు ప్రధాన కూడలిలో గోడపత్రికలను అతికించారు. సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు నాగ సైదయ్య మాట్లాడుతూ పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించుకోవాలని అవసరం ఉందన్నారు. చదువుకున్న విద్యావంతులు ఓటును ఒక మంచి నాయకుడికి వేసి గెలిపించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.ప్రచారంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు. తరువాయి6లో..


సబ్ జైలు ను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమణి

డోన్ సబ్ జైలు తనిఖీ

ప్రజాశక్తి-డోన్ : డోన్ సబ్ జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమణి శనివారం తనిఖీ చేశారు హైకోర్టు న్యాయమూర్తుల ఆదేశాల మేరకు డోన్ సబ్ జైలు ను తనిఖీ చేసి ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమణి మాట్లాడుతూ దొంగతనాల కేసులో ఒకసారి పట్టుబడి తే మీరు ఎక్కడ ఉన్నా అన్ని స్టేషన్లలో వివరాలు మీ గురించి ఉంటాయి కనుక దొంగతనాలు చేయవద్దని వివరించారు. సారాయి కేసులలో పదేపదే జైలుకు రావడం వలన మీ కుటుంబాలకు మీరు దూరము అవుతారని అన్నారు. పిల్లలను బాగా చదివించుకుని,మంచి స్థాయికి తీసుకొచ్చేందుకు మీరు కృషి చేయాలన్నారు. అదేవిధంగా సబ్ జైల్లో ముద్దాయిలకు అందిస్తున్న భోజనం,స్టోర్ రూమ్, తదితర ప్రాంతాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ రఘునాథ రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్. నరసింహుడు, కోర్టు సిబ్బంది సరిత, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వం ప్రలోభాలకు పాల్పడుతోంది

- డబ్బు పంపిణీ చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి
- రైతు సంఘం నాయకులు ముప్పాల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పాములపాడు


మాట్లాడుతన్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్రజాస్వామ్యంగా బెదిరిం పులకు, అధికార ప్రలోభాలకు పాల్పడుతోందని అధికార యంత్రాంగాన్ని తమ వైసిపి కార్యకర్తలు లాగా స్థాయి దిగజార్చుతోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నాడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాములపాడులో ప్రజా సంఘాల బృందం ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూళ్లలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు అనంతరం వారు విలేకరుల సమావేశం నిర్వహించి ఎన్నికల్లో ప్రభుత్వ తీరు పట్ల వారు మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు వారికి బలంగా ఉన్నప్పటికీని కొన్నిచోట్ల స్వతంత్ర అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తోందన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కలెక్టర్లు, డీఈవోలు, ఆర్జెడిలను ఒత్తిళ్లకు గురి చేస్తున్నార న్నారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తున్న తీరుగా ఉందని ఆయన అన్నారు. ర్యాలీకి పిలుపునిస్తే నిర్బంధాలు, లాటి చార్జీలు, విచక్షణ రహితంగా ప్రభుత్వం పైశాచికంగా వ్యవహరిస్తోందన్నారు. నిరంతరం ప్రజాసేవకుడు పోతుల నాగరాజును గెలిపించి శాసన మండలికి పంపించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో మాట్లాడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ఆయన ఎమ్మెల్సీ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి రామాంజనేయులు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగ మధు యాదవ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎన్ రంగ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి రఘురామ్మూర్తి, ఎస్‌టియు జిల్లా వైస్ ప్రెసిడెంట్ రత్నం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు సి హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

నంద్యాల కలెక్టరేట్ : రాజ్యాంగం కల్పించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం బెదిరింపులతో కక్కుర్తి రాజకీయాలతో అగౌరవపరుస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వానికి, జగన్ కు గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన ఉపాధ్యాయ లు, మేధావులు,విద్యావంతులకు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రెండు మండలాలుగా నంద్యాల

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా నంద్యాల మండలమును, నంద్యాల అర్బన్ మండలముగా విభజించుటకు ప్రభుత్వము ప్రతిపాదించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల అర్బన్ మండలంలో ప్రతిపాదించినందున ప్రజలు ఈ విషయమై షెడ్యులు నందు తెలిపిన వివరములపై ఏవేని అభ్యంతరములు వున్న ఈ గజెట్ నోటిఫికేషన్ ప్రచురించిన 30 రోజులలోపు నంద్యాల జిల్లా కలెక్టరుకు సమర్పించవలసినదిగా కోరారు.


హైకోర్టు న్యాయమూర్తి తో ఆళ్లగడ్డ న్యాయవాదులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాయిళాలపై కేసులు పెట్టాలి

- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు రంగనాయుడు

ప్రజాశక్తి - పాములపాడు


మాట్లాడుతున్న రంగనాయుడు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు రంగ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఒక ఓటరుకు రూ.5000 చొప్పున పంపిణీ చేసిన సంఘటన ఆత్మకూరు, నందికొట్కూరు, నంద్యాల, తదితర మండలాల్లో జరిగిందని ఆరోపించారు. నందికొట్కూరులో నవనంది, స్కాలర్స్, జీవనజ్యోతి ప్రైవేట్ స్కూళ్లలో కొంతమంది ఉపాధ్యాయులు వ్యతిరేకిం చినప్పటికిని బలవంతంగా కవర్లో పెట్టి డబ్బులు పంపిణీ చేసిన స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. డబ్బుల పంపిణీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నంద్యాలలో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. విచారణ జరిపి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని వారి డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



ఏపీలో వైసిపీ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోతున్నాయని, రాష్టంలో అరాచక పాలన సాగుతుందని నంద్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ విమర్శించారు. శనివారం నంద్యాల పార్లమెంటు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం నందు పార్టీ సర్వసభ్య సమావేశమునకు ముఖ్య అతిథిగా జిల్లా డీసీసీ అధ్యక్షుడు జే లక్ష్మీ నరసింహ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గత మూడున్నర ఏళ్లుగా చీకటి పాలన సాగుతోందని చరిత్రలో ఇంతటి నియంతృత్వ, ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని ఇప్పుడు చూడలేదన్నారు. కేంద్రంలో అధికారం లో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం గత 8 సంవత్సరలలో దేశని పూర్తిగా ప్రైవేకరించి దేశ సంపదను మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టుతోందన్నారు. మతం పేరిట ప్రజలను వేరు చేస్తున్నారని విమర్శించారు.

పోతుల నాగరాజును గెలిపించండి

ప్రజాస్వామ్యం రాజ్యాంగ ప్రజ్వర్జిల్లాలంటే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని లక్ష్మీ నరసింహ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షుడు దాసరి చింతాలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గంధం మల్లేశ్వర రెడ్డి, షేక్ అబ్దుల్లా , పిసిసి మెంబర్ యస్ ఎం డి ఫరూక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సికందర్ భట్, బీసీ సెల్ చైర్మన్ సంపంగి రామకృష్ణ, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షంసుల్ హక్, పిసిసి కో ఆప్షన్ సభ్యులు షేక్ ఆసర్ ఇస్మాయిల్, జిల్లా ట్రెజరీ సభ్యులు ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వాసవి మాతకు టేకు ఉయ్యాల విరాళం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల కేంద్రంలోని బేతంచెర్ల పట్టణంలో వెలసిన శ్రీ వాసవి మాత అమ్మవారి శాలకు 75 వేల రూపాయలు విలువచేసే టేకు ఉయ్యాలను బేతంచెర్ల పట్టణాలకు చెందిన కందగడ్డల రామ్మూర్తి లలితమ్మ దంపతులు శనివారం విరాళం అందజేశారు. ఈ ఉయ్యాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండా గోపాల్, బచ్చు సుబ్రమణ్యంల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక పూజలు తీర్థ ప్రసాదాలు అమ్మవారి శాల ఆధ్వర్యంలో అందజేసి వారిని సత్కరించారు.



అహోబిలేసున్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాలలో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి దర్శనానికి వచ్చిన సందర్భంగా ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆశీస్సులు పొందారు. హైకోర్టు న్యాయమూర్తి అహోబిలం క్షేత్రం దర్శనానికి వచ్చిన సందర్భంగా ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గోపాల్ రెడ్డి, ఏపీపీ సోమశేఖర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్రీనాథ్ రెడ్డి, శివరామిరెడ్డి ,నీలకంఠేశ్వరం, జనార్ధన్ శెట్టి లు లక్ష్మీ నరసింహ స్వామి మెమొంటోను అందజేసి సత్కరించారు. హైకోర్టు న్యాయమూర్తి వెంట జూనియర్ సివిల్ జడ్జి శైలజ, తహసిల్దార్ హరినాధరావు, ఆర్ఐ చంద్రశేఖరయ్య, డీఎస్పీ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి నంద్యాల పట్టణంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్ రూమ్ లోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. నంద్యాల పట్టణంలో ఏ ఏ చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయని వాటి పనితీరును స్వయంగా జిల్లా కలెక్టర్,ఎస్పీ అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సిబ్బందిని వారు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ ఎస్పీ కె. రఘువీర్ రెడ్డిలు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు.కొన్ని కేసుల్లో సీసీ కెమెరా పుటేజీలు సాక్ష్యాలుగా కూడా ఉపయోగపడుతున్నాయంటే సీసీ కెమెరాల ప్రాధాన్యత అర్థం చేసుకోవచ్చన్నారు.ఇప్పటికే పలు దొంగతనాలు, కిడ్నాప్ కేసుల్లో సీసీ కెమెరాల సాయంతో పోలీసులు కేసులను ఛేదించారని వారు పేర్కొన్నారు. చైన్‌స్నాచింగ్ కేసుల్లో సీసీ కెమెరాలే కీలకపాత్ర పోషిస్తున్నాయని,చైన్‌స్నాచింగ్ చేసిన వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివ్వడంలో సీసీ ఫుటేజీలు సాక్ష్యాలుగా ఉపయోగపడుతున్నాయని ఎస్పీ తెలిపారు. జాతీయరహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల్లోనూ కీలక సాక్ష్యాలను పోలీసులు సేకరించగలుగుతున్నారని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు.నేర నియంత్రణలో నిఘానేత్రం క్రియాశీల పాత్ర పోషిస్తుందని సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో నేరాల్లో ఆటలు సాగవని తెలిపారు. దొంగతనం కేసులను, యాక్సిడెంట్ కేసులను ,శాంతిభద్రతల విఘాతం కలిగించిన కేసులలో ఈవ్ టీజింగ్ కేసుల సీసీ కెమెరా పాత్ర చాలా కీలకమని వీటివల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చునని, చాలా కేసులను ఛేదించవచ్చునన్నారు. నంద్యాల పట్టణంలో ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా అత్యాధునిక కెమెరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కు ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోకి వచ్చి వెళ్లే ప్రతి వాహనాన్ని, ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించే విధంగా వాటి పనితీరు ఉంటుందని ,ఈ నిఘా నేత్రాలను పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో, సమస్యాత్మకమైన ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పి కలెక్టర్‌కు వివరించారు


మాట్లాడుతున్న కలెక్టర్


భోజనాన్ని రుచి చూస్తున్న డిఇఓ

చదువులో నైపుణ్యం మెరుగుపడాలి : డిఇఓ

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని గాజులపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బసాపురం మండల పరిషత్ పాఠశాలలను డిఇఓ అనూరాధ శనివారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను, వారి చదువుల నైపుణ్యములను అడిగి తెలుసుకున్నారు. ఆరవ తరగతి విద్యార్థులను వారి చదువుల నైపుణ్యం పరిశీలించగా, విద్యార్థుల చదువులు మెరుగుగా లేనందున పాఠశాల ఉపాధ్యాయులను హెచ్చరించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా ఉపాధ్యాయులు పిల్లలను తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల రిజిస్టర్లు, పాఠశాల రిజిస్టర్లు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి స్వయంగా భోజనం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో మహానంది మండల విద్యాధికారి రామసుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల చైర్మన్లు పాల్గొన్నారు.


ధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఇఓ

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి : ఎంఇఓ

ప్రజాశక్తి - చాగలమర్రి

పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఇఓ అనురాధ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. శనివారం మండలంలోని పెద్దబోధనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలక్ష్మి, సిఆర్‌పి వెంకటనారాయణలు పాల్గొన్నారు.


హోలీ సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

బాల అకాడమీలో ముందస్తు హోలీ సంబరాలు

ప్రజాశక్తి - నంద్యాల

పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో శనివారం రోజున ఘనంగా హోలీ సంబరాలను జరుపుకు న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత హాజరై మాట్లాడారు. హోలీ దేశమంతా జరుపుకునే పండుగల్లో ఒకటి అన్నారు. పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు పసుపు,కుంకుమ,గంధంలను పూసుకొని రంగు నీరు చల్లుకొని ఆనందోత్సాహంలో తేలియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో హరికృష్ణ

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి : ఎపిఒ

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ హరి కృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని క్రిష్ణగిరి చర్ల పుత్తూరు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు తగ్గాయని, ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులను పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు పఠనాసక్తి అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-డోన్

విద్యార్థులు భగవద్గీత,శ్లోకాలు,పఠనం,ఉచ్చారణ,కంఠస్థం అలవర్చుకోవాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్‌ఏ శాంతి అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని ఫోటాన్ ఇన్స్టిట్యూషన్ నందు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు పఠనం, ఉచ్చారణ, కంఠస్థం ఎలా ఉందో పరిశీలించారు. చక్కగా శ్లోకాలు చెప్పిన విద్యార్థులకు భహుమతులు అందజేశారు. ప్రతి రోజు ఏదేనా ఒక్క శ్లోకం చదివినా, వినాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా రిటైర్డ్ సెక్షనల్ ఆఫీసర్ అయినటువంటి చక్రపాణి, వ్యాపారవేత్త ఎలుకూరి నరేష్, క్లబ్ ప్రెసిడెంట్ ఆర్టీసీ శాంతి వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు అమీర్ బాషకి ప్రథమ బహుమతి, కరుణాకర్‌కు ద్వితీయ బహుమతి, కార్తిక్ తృతీయ బహుమతి,మహేష్ చతుర్థ బహుమతి విద్యార్థులకు క్లబ్ తరపున, నరేష్ తరపున బహుమతులు అందించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడి చేతుల మీదుగా అవార్డు పొందిన సాయినాథ్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమములో సాయినాథ్, స్మిత, ఇన్నర్ వీల్ క్లబ్ మెంబెర్స్ అనురాధ, విజయ లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

మహిళలు, విద్యార్థినిలు ఉన్నత న్యాయస్థానాలు ప్రవేశపెట్టిన మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి ఆర్ జగన్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బనగానపల్లె మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఫ్రీ లీగల్ కౌన్సిల్ ఆజా ము హుస్సేన్ మండల లీగల్ సభ్యులు కే. నరసింహారెడ్డి, అల్లావుద్దీన్ కళాశాల అధ్యాపకులు బడేషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆజం హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వము మహిళల కోసం అనేక సమక్షమాలతో పాటు న్యాయస్థానాలలో ఉచితంగా న్యాయ సాయం పొందేందుకు పలు అవకాశాలు కల్పించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను సూచించారు. ముఖ్యంగా విద్యా దశ నుండి పలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని వీటివల్ల తమ కుటుంబాలు గాని తమ ఇరుగుపొరుగువారు కానీ ఎలాంటి ఆర్థికంగా నష్టం వాటిల్లకుండా మండల న్యాయ సేవాధికార సంస్థల ద్వారా సత్వర న్యాయం ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. పలు అంశాల పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఆర్ జగన్నాథ్ రెడ్డి, మండల రఘురామిరెడ్డి, అల్లావుద్దీన్ నరసింహారెడ్డి, కళాశాల అధ్యాపకులు బడేసా ప్రసంగించారు. నేటి నుండి వారం రోజులపాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించినట్లు కోర్టు సిబ్బంది భారతీదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్నాథరెడ్డి

జర్నలిస్టు ల పై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - పాణ్యం

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య అని ఏపీడబ్ల్యూజెఎఫ్ పాణ్యం నియోజకవర్గం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వై.వి.సుబ్బయ్య, నీలం సత్యనారాయణ అన్నారు. కర్నూలు జిల్లా, కోడుమూరు నియోజకవర్గం వర్గంలో జర్నలిస్టు సతీష్‌పై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అనుచరుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పాణ్యం తహసీల్దార్ మల్లికార్జున రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వాలు, యంత్రాంగం చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతూ తగు ఆధారాలతో వార్తలు ప్రచురణ చేయడం వారి వృత్తి ధర్మం అన్నారు. అలాంటి వార్తలను సహించలేని పాలకులు జర్నలిస్ట్ లపై దాడి చేయడం దుర్మార్గం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజెఎఫ్(ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్,) పాణ్యం నియోజకవర్గం కమిటీ నాయకులు కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్,శీను, రంగస్వామి,రమేష్,దత్తు,అప్సర్ బాష,వెంకటేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల కేంద్రంలోని హనుమాన్ నగర్ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అదనపు నిర్మాణ పనులను బేతంచెర్ల మండలం విద్యాధికారి సోమశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యను అందించడం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రాష్ట్ర ప్రభుత్వాల నుండి మంచి విద్య కోసం పాఠశాలలలో 19 నూతన గదుల నిర్మాణం జరుగుతున్నాయని వారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం లోపల పాఠశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసుకున్న తర్వాత విద్యార్థులకు మంచి ఆహ్లాదకరమైన గదులు వాతావరణం ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎంఈఓ తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు

బండి ఆత్మకూర్ : మండలంలోని పార్లపల్లె పశు వైద్యశాల వైద్యులు డాక్టర్ గౌసియా బేగం, బండి ఆత్మకూరు పశు వైద్యశాల డాక్టర్ అనూష ఆధ్వర్యంలో శనివారం నాడు మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు నివారణకు పశు వ్యాక్సిన్లను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి పశువుకు గాలికుంట్ల వ్యాక్సిన్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌గా గాలికుంట్ల వ్యాక్సేషన్ కార్యక్రమాన్ని పశువైద్య సిబ్బంది గోపాల మిత్రులు కలిసి ఈ కార్యక్రమ ంలో విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఎవరైనా తమ పశువులకు గాలికుంట్ల వ్యాక్సిన్ వేయించకుంటే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్వాల నరసింహుడి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం రాత్రి ఎగువ అహోబిలంలో జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కళ్యాణోత్సవం కడు రమణీయంగా జరిగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు అర్చకులు లక్ష్మీ నరసింహ చార్యులు పంచామతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఎదుర్కోల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను కళ్యాణ మండపానికి తీసుకెళ్లి అక్కడ సాంప్రదాయం ప్రకారం కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి హాజరై నూతన కళ్యాణ మూర్తుల పాదాల చెంత ముత్యాల తలంబ్రాలు పోశారు.

దిగువ అహోబిలంలో... ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ చూర్ణాభిషేకం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాద వరద స్వామిని పొన్న చెట్టు వాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డి.ఎస్.పి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మొత్తం 350 మంది పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డి.ఎస్.పి

ప్రజావాణిని వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

5వ పేజీ తరువాయి..

జూపాడుబంగ్లా: ప్రజల సమస్యలపై పోరాడే వారిని శాసన మండలికి పంపిద్దామని, పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు ,కత్తి నరసింహారెడ్డికు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. శనివారం జూపాడు బంగ్లా మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు నరసింహులు, బి నాగేశ్వరరావు, రాము, , రైతు సంఘం అధ్యక్షుడు ఏసన్న, అబ్రహం, మదర్సా, మహిళా సంఘం నాయకురాలు మౌలాబీ గ్రామస్తులతో కలిసి ప్రభుత్వ స్కూల్స్, ప్రైవేటు స్కూలు, గ్రామ సచివాలయాలు ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పిటల్, అగ్రికల్చర్ కార్యాలయం, ఇంటింటికి తిరిగి పీడీఎఫ్ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. నాగేశ్వరావు మాట్లాడారు. ఈనెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని, మేధావులకు జరిగే ఎన్నికల్లో వ్యక్తిగత ప్రయోజనాల కన్నా ప్రజల ప్రయోజనాలే మిన్నగా భావించే వ్యక్తులను ఎన్నికల్లో ఎన్నుకోవాలని కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను జనసేన, కాంగ్రెస్ పార్టీలు బలపరుస్తున్నా యని తెలిపారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు అధికారం, పదవి కోసం తప్ప ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. **బండి ఆత్మకూర్:** ప్రజా నాయకుడు ప్రజాసేవ కోసం సర్వస్వం త్యాగం చేసి ప్రజల కోసం పనిచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి పోతున్న నాగరాజును పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని ప్రజాసంఘాల సమన్వయ కమిటీ నాయకులు రత్నమయ్య, డేవిడ్ రాజేష్‌ల ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో ప్రచారం చేశారు. **ప్యాపిలి :** అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చిన్న రహిమాన్, శ్రీనివాసులు, ఇలియాజ్, రామాంజినేయులు పేర్కొన్నారు. పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. **రుద్రవరం:** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలని గెలిపించాలని రైతు సంఘం జిల్లా నాయకులు రామచంద్రుడు, సిపిఐ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, సిపిఎం నాయకులు శంకర్ ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా రామచంద్రుడు, భాస్కర్ మాట్లాడుతూ ఉద్యమ నాయకులను గెలిపించి ఉద్యోగుల, నిరుద్యోగుల ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలిలో ఉద్యమ నాయకుల వాణి వినిపించడానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లనుఅభ్యర్థించారు. **ఆత్మకూరు** : పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఏ.రణధీర్, ఎఐటియు మాజీ రాష్ట్ర అధ్యక్షులు షణ్ముర్తి, జిల్లా మాజీ కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి కె. శ్రీనివాసులు,సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ. సురేంద్ర పట్టణంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాసంఘాల పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేస్తే ప్రజల పక్షాన మాట్లాడుతారని, ప్రజల ప్రయోజనాలను కాపాడుతారని,ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం పాటు పడతారని, రాజ్యాంగ విలువలను కాపాడతారని స్పష్టం చేశారు. **పోస్టర్లు విడుదల :** పిడిఎఫ్ అభ్యర్థులు గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు శనివారం నాడు ఎన్నికల ప్రచారం సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ప్రసాద్, న్యాయవాది అక్కిరాజు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు :** పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు గెలుపుకై వెలుగోడు మండలం లోనిఎస్సీ కాలనీ, బాషానగర్,రాజనగర్, సీపీ నగర్, ద్వారక నగర్, కొమ్మ పాలెం, లక్ష్మీ నగర్, బోయ రేవుల, మోత్కూరు తదితర గ్రామాలలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు వెలుగోడు మండల అధ్యక్షుడు వాదం నాగమోహన్ , జిల్లా ఆవాజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ రఫీ, బీసీ సంఘం రాష్ట్ర నాయకులుల రఘు రాముడు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కిషోర్, కృష్ణ, బాష, వెంకటయ్య పాల్గొన్నారు. **నందికొట్కూర్ :** నందికొట్కూర్ మున్సిపాలిటీ పట్టణంలో సిఎస్ఐ పాలెం, ఏబీఎం పాలెం అల్లూరు రోడ్డు చాకలిపేటలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, యువజన, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు ఎరుకలి రాజు, షాకీర్ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి సామన్న, ఎస్ మౌలాలి, అశోక్, మధుసూదన్ గౌడ్, ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్ అన్నారు. మల్యాల గ్రామంలో పోతుల నాగరాజు గెలిపించాలని పట్టభద్రులను కోరారు. వ్యాకాస మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్, పట్టభద్రులు వెంకటేష్ ,శ్రీరాములు గౌడ, మధు , తదితర పట్టభద్రులు పాల్గొన్నారు. **గడివేముల:** మండలంలో పోతుల నాగరాజుకి మద్దతుగా సిపిఎం, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చంటి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివ కృష్ణ, నాయకులు రాజేష్, అనిల్, మనోహర్ పాల్గొన్నారు. **నంద్యాల :** పిడిఎఫ్ బలపర్చిన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహ రెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ నంద్యాలలో ఎస్ టి యు ఏ ఐ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం వివిధ విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహింఎవఎఉ. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా కార్యదర్శి మౌలాలి, ఎస్‌టియు జిల్లా నాయకులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి,ఎస్సీ హాస్టల్ కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీశైలం ప్రాజెక్టు : గోడ పత్రికను అతికిస్తున్న నాయకులు


శ్రీశైలంలో...


జూపాడుబంగ్లా: ప్రచారం చేస్తున్న నాయకులు


మహిళా కానిస్టేబుల్ కు నగదు రివార్డును అందజేస్తున్న సీఐ

మహిళా కానిస్టేబుల్‌కు నగదు రివార్డు

ప్రజాశక్తి బనగానపల్లె

బనగానపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే మహిళా కానిస్టేబుల్ శివ కుమారికి సీఐ సుబ్బరాయుడు నగదు రివార్డును అందజేశారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్ శివకుమారి సీఐ సుబ్బారాయుడు, ఎస్సై రామిరెడ్డి నగదు రివార్డు అందజేశారు. మహిళా పోలీసు శివకుమారి పోలీస్ స్టేషన్‌లో రికార్డ్స్ అప్డేట్ చేయడంలో, శివరాత్రి రోజు యాగంటి గుడిలో భక్తుల క్యూ లైన్ నిర్వహణలో పెద్దమ్మ తల్లి దేవరలో ఏంతో కష్టపడి శ్రమకూర్చి డ్యూటీ పట్ల నిబద్ధతతో పని చేసినందుకు ఉన్నత అధికారుల ఉత్తర్వుల మేరకు రివార్డ్‌ను ఇచ్చి ప్రోత్సహించారు. భవిష్యత్‌లో శివ కుమారి పోలీస్ డ్యూటీలో ఇంకా ఎంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని పోలీసు అధికారులు కోరారు.

బైక్‌పై నుండి పడి మహిళ మృతి

ప్రజాశక్తి - పగిడ్యాల

మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడ ప్రమీల (53) అనే మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నెహ్రూ నగర్ గ్రామానికి చెందిన ప్రమీల తన కొడుకు మోటార్ సైకిల్ పై వెనక కూర్చొని వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల కూర్చున్న ప్రమీల అదుపుతప్పి కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో 108 లో కర్నూల్ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలకు వెళ్లే లోపు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూల్ వైద్యశాలలో ఉంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముచ్చుమరి పోలీసులు తెలిపారు.



సమాజంలో మీడియా పాత్ర ఎనలేనిది : సిఐ

ప్రజాశక్తి - పాణ్యం

సమాజంలో మీడియా పాత్ర ఎనలేనిదని పాణ్యం సీఐ వేంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. శనివారం ఏపి డబ్ల్యుజెఎఫ్ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడేషన్) పాణ్యం నియోజకవర్గం కమిటి ఆద్వర్యంలో ఏపిడబ్ల్యుజెఎఫ్ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడేషన్) - 2023 డైరీని పాణ్యం సీఐ వేంకటేశ్వర్ రావు చేతులమీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సంధర్భంగా సీఐ మాట్లాడారు. ప్రభుత్వాలు,ప్రజలకు వారధిగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ విషయంలో జర్నలిస్ట్ లు అహర్నిశలు వార్తలతో ప్రజలను, ప్రభుత్వాలను చైతన్యం చేయడం అభినందనీయం అని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో గడివేముల ఎస్సై వెంకట సుబ్బయ్య, పాణ్యం ఎస్సై సుధాకర్ రెడ్డి,ఏపీడబ్ల్యూజెఎఫ్ (ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్,) పాణ్యం నియోజకవర్గం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వై.వి.సుబ్బయ్య,,నీలం సత్య నారాయణ,నాయకులు కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్,శీను, రంగస్వామి,రమేష్,దత్తు,అప్సర్ భాష,వెంకటేష్,బాలు,తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని తహశీల్దార్ షేక్ మొహిద్దీన్ సూచించారు. తమ పరిధిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి విధి నిర్వహణలో అందుబాటులో ఉండాలని అన్నారు. సచివాలయాలకు వచ్చే సిబ్బంది బయో మెట్రిక్ లేద ఫేస్ యాప్‌లను ఉపయోగించుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది పనీతీరు గురించి జిల్లా స్థాయి అధికారులు ఆన్ లైన్ లో నిత్యం నిఘా పెట్టారని విధి నిర్వహణలో అలసత్వం వహించి ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు.

పందులను తరలించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రాంతాల నుండి పందులను తరలించాలని ఎంపిపి సంజీవరెడ్డి పందుల పెంపకం దారులకు సూచించారు. శనివారం నాడు మండల కేంద్రంలో విచ్చలవిడిగా పందులు గ్రామంలో తిరగడం పంట పొలాల్లో పడి నాశనం చేయడంపై మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. పందుల సమస్యలను గ్రామ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకురావడంతోఈ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి పందుల పెంపకం దారులు రఘురాముడు, తదితరులు హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న పందులను రెండు రోజుల్లో గ్రామం నుండి తొలగిస్తామని వారు తెలిపారు. అనేక రోజులుగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం కావడంతో అధికారులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్త, ఈఓఆర్‌డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విప్రో కంపెనీ ఉద్యోగాలకు నేషనల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల

నేషనల్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 45 మంది విద్యార్థులు ప్రముఖ బహుళజాతి సంస్థ విప్రో కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు నేషనల్ విద్యాసంస్థల అధినేత డా.యస్. ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో 5వ సెమిస్టర్ డిగ్రీ చదువుతున్న బి.సి.ఏ., బి.యస్.సి.(కంప్యూటర్ సైన్స్) విద్యార్థులు విప్రో కంపెనీ ఆన్లైన్ ద్వారా నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో వివిధ దశలను దాటి 45 మంది విప్రో నుండి ప్రోగ్రామర్ ట్రైనీలుగా నియమకపత్రాలను పొందినట్లు తెలిపారు. వీరు విప్రో కంపెనీలో ఉద్యోగంతో పాటు బిట్స్ పిలాని నుండి నాలుగు సంవత్సరాలు ఎం.టెక్. కోర్సును ఉచితంగా విప్రో సౌజన్యంతో పూర్తి చేసే అద్భుత అవకాశం కల్పించబడుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ బహుళ జాతి సంస్థలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల యందు తమ కళాశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించి, తమ కళాశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమమడింపజేయడం జరిగిందన్నారు. ప్రతీ సంవత్సరం తమ కళాశాలలో కంప్యూటర్స్ విద్యార్థులు 100శాతం ప్లేస్మెంట్స్ సాధిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యా భోధనలో తాము పాటిస్తున్న అత్యున్నత విద్యా ప్రమాణాలకు నిదర్శనం విప్రో నియామకాలు అని అన్నారు. ఇంకా అనేక మంది విద్యార్థులు వివిధ బహుళ జాతి కంపెనీల ఎంపికలో పాల్గొని ఎంపిక పూర్తి చేసుకొని ఆఫర్ లెటర్ కోసం ఎదురు చూస్తూ ఉన్నారని, త్వరలో వారందరూ కూడా ఉద్యోగాలకు ఎంపికవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులు మాట్లాడుతూ తమ కళాశాల యాజమాన్యం, ప్లేస్మెంట్ సెల్ అందించిన నిరంతర ప్రోత్సాహంతోనే ఉద్యోగాలను సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డి.వేణుగోపాల్, ప్లేస్‌మెంట్ అధికారి సాయికుమార్‌లు పాల్గొన్నారు.

